క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



కోసి రూరల్: ఎస్‌జీఎఫ్ అండర్–15 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలో ప్రతిభ కనబరచి జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు గుండుమాల్ పీఎంశ్రీ ఉన్నత పాఠశాల విద్యార్థి కీర్తన ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18,19న రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ నెల 28, 29లో పూణేలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున ఆడనుండడంతో మంగళవారం అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో పీడీ స్వప్న తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి సన్మానం

కోస్గి: జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని కీర్తనను సీఐ సైదులు అభినందించారు. అండర్–15 బాలికల విభాగంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపికైంది. ఈ క్రమంలో సీఐ తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, పీడీ నర్సింహారెడ్డి, కోచ్ సాధిక్‌తో పాటు విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ




మాగనూర్: మండలంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల విద్యార్థులు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో సత్తా చాటినట్లు పాఠశాల పీడీ రాకేష్‌శర్మ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో సన్మానించి అభినందించారు. ఈ నెల 22న జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో శాలిని (8వ తరగతి) హైజంప్‌లో జిల్లా మొదటిస్థానం, నవ్యశ్రీ (6వ తరగతి) లాంగ్ జంప్‌లో రెండో స్థానం, చరణ్ (9వ తరగతి) జావెలిన్ త్రో లో రెండో స్థానంలో శివ కుమార్ (10వ తరగతి) మూడో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో మురళీధర్‌రెడ్డి, గ్రామపెద్దలు నర్సింహారెడ్డి, రమేష్‌గౌడ్, ఉపాధ్యాయులు బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి దరఖాస్తుల పరిశీలన

కోస్గి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదల్లో ఆర్థిక భరోసాను కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని మండల తహసీల్దార్ బక్క శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 20 మంది కల్యాణలక్ష్మి , షాది ముబారక్ పథకం లబ్ధిదారులతో మాట్లాడి అవసరమైన పత్రాలను పరిశీలించారు. ఎలాంటి అవకతవకలు లేకుండా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ భీమమ్మ , జూనియర్ అసిస్టెంట్ జరీనా తదితరులు ఉన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



కోస్గి రూరల్: అడ్వకేట్‌పై దాడికి నిరసనగా మండలంలోని న్యాయవాదులు విధులను బహిష్కరించారు.ఈ సందర్భంగా కోస్గి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె ఓంప్రకాష్ మాట్లాడుతూ కూకట్‌పల్లి బార్‌మెంబర్ న్యాయవాది తన్నీరుశ్రీకాంత్‌పై సోమవారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను ప్రభుత్వం వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శకనప్ప, ప్రభాకర్, మురళీ మోహన్ నామాజీ , సంతోష్, రాజలింగం, భీమేష్ , తాజ్‌ఖాన్, రాజురెడ్డి, మల్లేష్, మురళీ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఆత్మకూర్: మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి నట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. అనుమతి లేకుండా రేచింతల ఊకచెట్టువాగు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సోమవారం అర్ధరాత్రి దాడి చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మట్టి గణపయ్యకే జైకొడదాం

నారాయణపేట టౌన్: జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి వినాయక చవితి సందర్భంగా గణనాథులు మండపాలలో కొలువుదీరనున్నారు. పండగలు అంటేనే మన సంస్కృతిని మన తర్వాతి తరాలకు అందించేవి. అయితే ఇప్పుడు పండుగల పేరుతో ప్రకృతి హననం జరుగుతుంది. దీంతో ప్రకృతి ప్రేమికులు, అధికారులు మట్టి వినాయకుడిని పూజించేలా అవగాహన కల్పిస్తున్నారు.

● నారాయణపేటలోని శ్రీ హంసవాహిని ఉన్నత పాఠశాలలో వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని మంగళవారం విద్యార్థులు ఏకో ఫ్రెండ్లీ గణనాథులను తయారు చేశారు. ఈ సందర్భంగా చక్కటి ప్రతిమలను ఎంపిక చేసి విద్యార్థులకు బహుమతులను అందించారు.

విద్యార్థులకు అవగాహన

కోస్గి రూరల్: మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని ప్రధానోపాధ్యాయురాలు వెంకటేశ్వరి అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మట్టి వినాయకుల తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రసాయన పదార్థాలతో తయారు చేసిన విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేయడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు.

● మట్టి వినాయకులతో పర్యావరణాన్ని రక్షించవచ్చని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన 100 మట్టి గణపతులను స్థానికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అనిల్, శ్రీనాథ్, దశరథ్ ఉన్నారు.



కోస్గిలో మట్టి గణపతులు తయారు చేసిన విద్యార్థులు

మట్టి విగ్రహాల వితరణ

మద్దూరు: పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయకులను పూజిద్దామని పుర కమిషన్ శ్రీకాంత్ సూచించారు. వినాయక చవితిని పురస్కరించుకొని మంగళవారం మద్దూరు పుర కార్యాలయం ఆవరణలో మట్టి వినాయకులను అందజేశారు. అలాగే మద్దూరు పట్టణంలోని 1, 2 వార్డులోని ప్రజలకు పెరటి మొక్కలను అందజేశారు.

ఇంటింటికీ పంపిణీ

మాగనూర్: వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలకు పూజలు చేద్దామని వడ్వాట్ జిల్లా పరిషత్తు పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పాఠశాలలో ఏకో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన మట్టి వినాయకులను ఉపాధ్యాయులు విద్యార్థులకు అందజేశారు. ఏటా పాఠశాల ఆవరణలో విద్యార్థులంతా కలిసి మట్టి వినాయకుని విగ్రహాలను తయారు చేసి ఇంటింటికీ అందజేస్తున్నట్లు తెలిపారు.

పర్యావరణ హితానికి కృషి

దామరగిద్ద: మట్టి వినాయకులను పూజించి పర్యావరణ హితానికి పాటు పడాలని కాన్‌కుర్తి జెడ్పీఎచ్‌ఎస్ పాఠశాల ఉపాధ్యాయలు విశ్వనాథ్ అన్నారు. మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులు మట్టి వినాయకులను తయారు చేసి పర్యావరణం పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు.

ప్రత్యేక ఆకర్షణగా మండపం

ధన్వాడ: నేటి నుంచి ప్రారంభం కానున్న వినాయక ఉత్సవాల కోసం మండలపాల నిర్వాహకులు అన్ని సిద్ధం చేశారు. వినాయక మండపాలను వివిధ రకాల డిజైన్స్‌లతో తీర్చిద్దిదారు. ధన్వాడలో వినూత్న ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అప్పాజీగౌండ్‌లో ఆదియోగి శివుడి విగ్రహం మండపానికి ఎంట్రీలో ఏర్పాటు చేసి మట్టి గణపతి ప్రతిష్ఠించనున్నారు. ఇది చూపరులను ఆకట్టుకుంటోంది.

వినాయక చవితి సందడి షురూ

మక్తల్: మండలంలో వినాయక చవితి సందడి మొదలైంది. ఇప్పటికే మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. చుట్టుపక్కల నుంచి విగ్రహాలను కొనుగోలు చేసేందుకు మక్తల్‌కు వస్తుండడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రతిష్ఠాపనకు సిద్ధంగా ఉన్న మట్టి గణపతులు



నారాయణపేటలో ఎకో ఫ్రెండ్లీ గణనాథుల ప్రతిమలతో చిన్నారులు..



మాగనూర్‌లో విద్యార్థులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



దామరగిద్దలో మట్టి వినాయకులతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కోస్గి రూరల్: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్‌ట్రస్టు , వాసన్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన వలస సహాయ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నమూనా ఇందిరమ్మ గృహంలో వలస సహాయ కేంద్రాన్ని, మొబైల్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్టు , వాసన్ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని నిజామాబాద్, నారాయణపేట్ జిల్లాలను పైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపిక చేసి వలస సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా వాతావరణ మార్పుల వల్ల కలిగే వైపరీత్యాలను తట్టుకునేందుకు గ్రామాలలోని వలస కుటుంబాల మహిళలు, యువతకు వ్యవసాయ, వ్యవసాయేతర జీవనోపాదులను మెరుగుపరచుకునేందుకు అవసరమైన శిక్షణ, నైపుణ్యాలను ఇవ్వనున్నారని తెలిపారు. మానసిక శ్రేయస్సు, మార్గదర్శకాలపై సలహాలు, సంప్రదింపులు పొందవచ్చన్నారు. వలస సహాయ కేంద్రానికి అనుబంధంగా వలస సహాయ కేంద్రం మొబైల్ వాహనం ఉపయోగపడుతుందన్నారు. గత ఫిబ్రవరిలో జపాన్ దేశానికి చెందిన ఓ సంస్థ సభ్యులు జిల్లాలో వలసల గురించి తెలుసుకునేందుకు వచ్చారని గుర్తు చేశారు. అలాగే వలసల నివారణకు మరెన్నో ప్రాజెక్టులు వచ్చి పేట వలసలు లేని జిల్లాగా మారాలని కలెక్టర్ ఆకాక్షించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ మొగులప్ప, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్ , ఎంపీడీఓ శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు , ఎంఈఓ శంకర్‌నాయక్, ఐఓఎం రాష్ట్ర సమన్వయ కర్త జలజ, మార్ట్ ఆశీర్ తదితరులు ఉన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

మక్తల్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండుగలను శాంతి యుతంగా జరుపుకోవాలని మక్తల్ సీఐ రాంలాల్ అన్నారు. మంగళవారం ఆయన శాంతి సమావేశం నిర్వహించారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలను అందరూ కలిసి మెలిసి జరుపుకోవాలన్నారు. అలాగే ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదన్నారు. శోభాయాత్ర సమయంలో, విగ్రహాలను ఏర్పాటు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటించాలన్నారు. నిబంధలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ గణేశ్‌కుమార్, తహసీల్దార్ సతీశ్‌కుమార్, కమిషనర్ నర్సింములు, ఏఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మక్తల్‌లో మాట్లాడుతున్న సీఐ రాంలాల్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు

నారాయణపేట టౌన్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా కన్వీనర్ నరేష్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంబడే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు కళాశాల నిర్వాహకులు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వారి భవిష్యత్తును నాశనం చేస్తున్నారన్నారు. కావునా ప్రభుత్వం వెంటనే బకాయి నిధులు విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నగర్ కార్యదర్శి సతీష్ మరియు ఇతర ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కోస్గి: కుటుంబ కలహాలతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నేపథ్యంలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మున్సిపల్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. మున్సిపల్ పరిధిలోని తిమ్మాయపల్లికి చెందిన మొగులయ్య(32)కు భార్యతో తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో గత వారం ఇరువురి మధ్య మళ్లీ వాగ్వాదం జరగడంతో మనస్థాపానికి గురైన మొగులయ్య ఈ నెల 14న పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో పాలమూర్ జిల్లా ఆస్పత్రికి, అక్కడ నుంచి హైదరాబాద్‌కు తరలించగా సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య కళావతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మొగులయ్య(ఫైల్)

పర్యావరణ రక్షణ మనందరి బాధ్యత



పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రీనరీతో సభ్యులు

దామరగిద్ద: పర్యావరణాన్ని రక్షించాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ బోర్డు సభ్యుడు మాదవరెడ్డి, అన్నమయ్య అన్నారు. మంగళవారం మండలంలోని క్యాతనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షపు నీటి సరంక్షణ, ఔషధ తోట, తోటలు, వృక్షారోపణ వంటి అంశాలపై ప్రదర్శన ఇచ్చి పచ్చదనం ప్రాధ్యాన్యతను వివరించారు. అనంతరం విద్యార్థులతో గ్రీన్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఎచ్ఎం వెంకటప్ప, పీడీ బాల్‌రాజ్‌గౌడ్, సునిత, సీజీఆర్ సమన్వయ కర్తలు రవికుమార్, బాలాంజనేయులు, సతీష్, జగన్, శివరాజ్ పాల్గొన్నారు.

నారాయణపేట టౌన్: నారాయణపేట మండలంలోని జాజాపూర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం కౌన్సల్ ఫర్ గ్రీన్ రివాల్యూషన్ ఆధ్వర్యంలో యంగ్ యర్త్ లీడర్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా స్కూల్ గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సీజీఆర్ చైర్మెన్ లీలా లక్ష్మారెడ్డి, జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, నాబార్డ డీడీఎమ్ షన్ముఖ చారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ మేరకు సీజీఆర్ చైర్మెన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యత దెబ్బ తినకుండా ప్రతి ఒక్కరు మొక్కలు పెంచడంతో పాటు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి భానూ ప్రకాష్, పాఠశాల ప్రధానోపాధ్యారాలు భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

30న మెగా వైద్యశిబిరం



కోస్గి: జర్నలిస్టుల కుటుంబాల కోసం ఈనెల 30న ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి సూచించారు. ఈ మేరకు మంగళవారం కోస్గిలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం ప్రతినిధులు, స్థానిక జర్నలిస్టులతో కలిసి వైద్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ యశోద హాస్పిటల్ వారి సహకారంతో వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు రఘు, సంజీవ్, రాజేష్, సురేష్, శ్రీనివాస్‌తో పాటు స్థానిక జర్నలిస్టులు శంకర్, ఏబీఎస్ శేఖర్, వెంకట్, అజీజ్, రమేష్, సల్మాన్ రాజ్, మోహన్, ప్రవీన్, అతిక్, తిరుమలేష్, చైతన్య, రాజు, రశీద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం

నర్వ: ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టి.. పర్యావరణాన్ని కాపాడుకుందామని జన విజ్ఞాన వేదిక, విజ్ఞాన దర్శిని రాష్ట్ర కమిటీ సభ్యులు మహేందర్ అన్నారు. మంగళవారం నర్వ పోలీస్ స్టేషన్‌లో ప్లాస్టిక్‌కు చెక్ పెట్టేందుకు పేపర్ పెన్నులను వినియోగించేలా ఎస్‌ఐ రమేష్‌తో పాటు సిబ్బందికి పేపర్ పెన్నులను అందించి విడుద ల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పర్యావరణ రక్షకులుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు నిలవాలని, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్లాస్టిక్‌కు చెక్ పెట్టి పర్యావరణాన్ని కాపాడాలని అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు రామకృష్ణ, రామన్‌గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ కళాశాల, శ్రీ సాయి జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు వైఆర్‌జీ కేర్ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు సంస్థ డీఆర్‌పీ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీ పట్ల అవగాహన కల్గి ఉండాలని అదే విధంగా ప్రతి వ్యక్తి వారి యొక్క హెచ్‌ఐవీ స్థితిని కచ్చితంగా తెలుసుకోవాలన్నారు. హెచ్‌ఐవీ ఎలా వస్తుంది, ఎలా రాదు, రాకుండా ఉండడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఒకవేళ హెచ్‌ఐవీ సోకితే ఏం చేయాలి, హెచ్‌ఐవీ సోకిన వారి పట్ల మనం ఎలా మెలగాలి అనే విషయాల గురించి క్లుప్తంగా వివరించారు. అలాగే హెచ్‌ఐవీ-ఎయిడ్స్ నివారణ చట్టం-2017 గురించి అదే విధంగా ఎయిడ్స్‌కు సంబంధించిన టోల్ ఫ్రీ నెంబర్ 1097పై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ కృష్ణ, సీఎల్‌డబ్ల్యూ అశోక్, నరసింహులు పాల్గొన్నారు.

బాధితులకు చెక్కుల పంపిణీ

కోస్గి రూరల్: పట్టణంలోని రామాలయం చౌరస్తా నుంచి సయ్యద్‌పహడ్ దర్గా వరకు రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ , మున్సిపల్ కమిషనర్ నాగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మొదటి విడతలో 112 మంది లబ్ధిదారులకు రూ.2.50 కోట్లు పంపిణీ చేయగా తాజాగా రెండో విడతలో 32 మంది లబ్ధిదారులకు రూ.84 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, అన్నకిష్టప్ప, మేకల రాజేష్ , ఇద్రుస్ , నాగులపల్లి నరసింహ, హన్మిరెడ్డి, హాజీ తదితరులు ఉన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న వార్ల విజయ్‌కుమార్

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మాగనూర్: అధిక వర్షాలతో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలని ఉమ్మడి బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మాగనూర్ ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఉమ్మడి మండల అధ్యక్షుడు నల్లెనర్సప్ప మాట్లాడుతూ.. మండలంలో అధిక వర్షపాతం వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకుని ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు యాసంగి వరి రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ వెంటనే రైతులకు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జయనందరెడ్డి, కనకరాజు, వాకిటి మల్లేష్, కరిమిని తిమ్మప్ప, మహేష్‌ప్రసాద్, వెంకటప్ప, భీమేష్, నర్సిములు, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

చిట్టెం నర్సిరెడ్డి ఆశయ సాధనకు కృషి

మక్తల్: చిట్టెం నర్సిరెడ్డి ఆశయ సాధనకు నిరంతరంగా కృషి చేస్తానని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మక్తల్‌లో మినీ ట్యాంకు బండ్‌పై చిట్టెం నర్సిరెడ్డి 96వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహం పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. నియోజకవర్గంలో సంగంబండ, భూత్పూర్ భీమా ప్రాజెక్టులను సాధించి రైతులకు సాగునీరు, తాగునీరు అందించిన ఘనత చిట్టెం నర్సిరెడ్డికే దక్కుతుందన్నారు. ఆయన తుది శ్వాస విడిచే వరకు ప్రజాసేవకే అంకితమయ్యారన్నారు. ప్రజా సేవకు చిట్టెం కుటుంబం ముందు వరుసలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకట్‌రామారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, మండలాల అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, శివారెడ్డి, చిన్నహన్మంతు, సాగర్, ఈశ్వర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘన నివాళి అర్పించిన ఎమ్మెల్యే

నారాయణపేట/ధన్వాడ/కృష్ణ: మా తాతయ్య చిట్టెం నర్సిరెడ్డి ఆశయాన్ని నేరవేర్చేందుకు తన వంతు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మంగళవారం స్వర్గీయ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలోని చిట్టెం నర్సిరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతానికి జాయమ్మ చెరువు ద్వారా సాగు నీరు అందించడమే తాతాయ్య కల అని ...పేట-కొడంగల్ ప్రాజెక్టుతో ఈ కల సాకారం అవుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, పీసీసీ సభ్యుడు చిట్టెం అభిజయ్ రెడ్డి , కార్యకర్తలు పాల్గొన్నారు.



నర్సిరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, నాయకులు

మండల ప్రత్యేకాధికారికి ఘనంగా వీడ్కోలు

ఊట్కూరు: ఊట్కూరు మండల ప్రత్యేకాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఉమాపతికి తోటి సిబ్బంది మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఏడాది కాలంగా మండల ప్రత్యేకాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఉమాపతి ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో మంగళవారం ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, ఏపీఓ లక్ష్మారెడ్డి, లక్ష్మినర్సింహరాజు, వెంకటేష్, ఉపాధి పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొంకన్వానిపల్లెను సందర్శించిన వైద్యబృందం

అమరచింత: మండలంలోని కొంకన్వానిపల్లెకు చెందిన 11 ఏళ్ల బాలుడి డెంగ్యూ రావడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తిపుడం పల్లి పీహెచ్‌సీ వైద్య బృందం గ్రామాన్ని సందర్శించి దోమల నివారణ కోసం మందులను పిచికారీ చేశారు. అదే విధంగా ఇంటింటికి వెళ్లి రక్త నమూనాలను సేకరించి పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు హెల్త్ సూపర్ వైజర్ సురేందర్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎఎల్‌ఓ టీం సభ్యులు హెల్త్ అసిస్టెంట్స్ గంధం రాజు, సాయన్న, కార్యదర్శి మోహన్, ఏఎన్ఎం శారద పాల్గొన్నారు.